www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విజయ దశమి శుభాకాంక్షలు

శనివారం | 12-10-2024 | పేజీలు: 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 178

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.59 తదుపరి దశమి; నక్షత్రం: శ్రవణం తె. 4.25 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 9.15 -10.47; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.44; అమృతఘడియలు: రా. 6.28-8.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51

అల్లూరి సీతారామరాజు జిల్లా

Visakhapatnam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మహాలక్ష్మి రూపంలో కనకమహాలక్ష్మి దర్శనం

విశాఖపట్నం, అక్టోబరు 11:
శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం శ్రీమహాలక్ష్మి రూపంలో కనకమహాలక్ష్మి దర్శనమిచ్చారు. శాకాంబరిగా ప్రత్యేక అలంకరణ జరిపి పూజలు నిర్వహించారు. కనకమహాలక్ష్మికి దేవస్థానం ఈవో కె.శోభారాణి, అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. విజయదశమి పర్వదినం రోజైన శనివారం కనక మహాలక్ష్మికి స్వర్ణ కవచాలంకరణ, స్వర్ణ పుష్పాలతో పూజలు చేస్తారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

40 దుకాణాలకు 1,203 దరఖాస్తులు..

- సగటున ఒక్కో షాపునకు 30..
- అత్యధికంగా ఎటపాకలో ఒక షాపునకు 70..
- అత్యల్పంగా పెదబయలులో ఒక షాపునకు 6 దరఖాస్తులు మాత్రమే
- పెదబయలు, జి.మాడుగులలో సిండికేట్

పాడేరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):
జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలోని పాడేరు, అరకులోయ, చింతపల్లి, రంపచోడవరం, చింతూరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 40 మద్యం దుకాణాలకు గానూ 1,203 దరఖాస్తులు అందాయి. జిల్లాలోని పాడేరులో ఎక్సైజ్ స్టేషన్(10 షాప్‌లు) 232, అరకులోయ(6) 158, చింతపల్లి(6) 141, రంపచోడవరం(10) 260, చింతూరు(8) 412 దరఖాస్తులు అందాయి. అయితే ఏజెన్సీలో సారా అధికంగా ఉండడంతో వైన్‌షాప్‌లకు ఆశించిన స్థాయిలో డిమాండ్ ఉండదని భావించినప్పటికీ అందుకు భిన్నంగా పోటాపోటీగా దరఖాస్తులు చేశారు.



పాడేరు ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చింతూరు స్టేషన్ పరిధిలో 8 షాప్‌లకు 412 దరఖాస్తులు

జిల్లాలోని చింతూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో అక్కడ 4 మండలాల్లోని 8 దుకాణాలకు మొత్తం 412 దరఖాస్తులు అందాయి. ప్రధానంగా చింతూరు ప్రాంతం తెలంగాణా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడం, పర్యాటకుల తాకిడి, నాలుగు రాష్ట్రాలకు చెందిన జనం రాకపోకలు అధికంగానే ఉంటాయి. అలాగే చింతూరు పరిధిలోని మద్యం దుకాణాల కోసం తెలంగాణా రాష్ట్రానికి చెందిన వాళ్లే ఎక్కువగా పోటీ పడుతున్నారు. దీంతో సగటుగా ఒక్కో షాప్‌నకు 50 దరఖాస్తులు చేశారు. ఖమ్మం, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో స్థిరపడిన వాళ్లు ఆంధ్రాలో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు పోటీపడుతున్నారు. దీంతో ఎటపాకలో ఒక షాప్‌నకు 70, మరో షాప్‌నకు 65 దరఖాస్తులు అందాయి.

పెదబయలు, జి.మాడుగులలో సిండికేట్..

జిల్లాలోని పెదబయలు, జి.మాడుగులలోని వైన్ షాప్‌లను దక్కించుకునేందుకు సిండికేట్‌లు పావులు కదిపారు. దీంతో పథకం ప్రకారం దరఖాస్తులు చేశారని తెలుస్తున్నది. పెదబయలులో రెండు దుకాణాల్లో ఒకదానికి 6, మరొక దానికి 9, అలాగే జి.మాడుగులలోని ఒక షాప్‌కు 9 మాత్రమే దరఖాస్తులు అందాయి. అలాగే ... మిగతా 4వ పేజీలో

విపత్తుపై విజయం



హుద్‌హుద్ తుఫాన్‌కు ఘాట్‌లో ధ్వంసమైన కాఫీ తోటలు(ఫైల్)

మన్యంలో పచ్చదనాన్ని హరించిన హుద్‌హుద్

37 వేల ఎకరాల్లో కాఫీ తోటలకు నష్టం

- అరకులోయ మండలం మేదరశాలలో ఇల్లు కూలిపోయి నలుగురు మృతి

(పాడేరు- ఆంధ్రజ్యోతి)
మన్యంలో పచ్చదనాన్ని హరించిన హుద్‌హుద్ తుఫాన్ సంభవించి పదేళ్లు కావస్తుండడంతో అప్పటి బీభత్సాన్ని గిరిజనులు ఎన్నటికీ మరచిపోలేరు. ప్రధానంగా కాఫీతోటలపై తుఫాన్ ప్రభావం అధికంగా పడింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నష్టాన్ని పూడ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడంతో తుఫాన్ చేసిన గాయాలు మానిపోయాయనే చెప్పుకోవచ్చు. ఏజెన్సీలో పాడేరు, అనంతగిరి ఘాట్‌లో రాకపోకలు ఇబ్బందులు ఏర్పడగా.. ప్రజల వ్యక్తిగత ఆస్తులకు అంతగా నష్టం జరగలేదు. అరకులోయ, అనంతగిరి మండలాల్లో కొన్నిచోట్ల కొండచరియలు, ఇళ్లు విరిగిపడగా, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో తుఫాన్ ప్రభావం అంతగా లేదు. జి.మాడుగుల ... మిగతా 4వ పేజీలో

పెనుతుఫాన్‌ను ఎదుర్కొని నిలబడ్డ విశాఖపట్నం

- హుద్‌హుద్ విలయానికి నేటికి పదేళ్లు
- అవకాశంగా తీసుకుని ఎదిగిన నగరం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
హుద్ హుద్.. ఈ పేరు వింటే విశాఖ ప్రజల ఒళ్లు ఒక్కసారిగా జలదరిస్తుంది. ఓ విషాద వీచిక కళ్ల ముందు కదలాడుతుంది. పదేళ్ల క్రితం ఇదే రోజున (2014 అక్టోబరు 12) విశాఖపట్నం 'హుద్ హుద్' తుఫాన్ ధాటికి చిగురుటాకులా వణికిపోయింది. గంటకు 206 కి.మీ. వేగంతో వీచిన గాలులకు ఛిన్నాభిన్నమైపోయింది. రూపురేఖలు కోల్పోయింది. చెట్లు కూకటివేళ్లతో సహా విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సమాచార వ్యవస్థ స్తంభించిపోయింది. చిమ్మచీకట్లు. నగరం ఎలా కోలుకుంటుందో, ఎప్పటికి తేరుకుంటుందోనని అంతా భయపడ్డారు. కానీ కిందికి కొట్టిన బంతి ఎలా పైకి లేస్తుందో అదేవిధంగా విశాఖపట్నం శరవేగంతో అభివృద్ధి సాధించింది. ఇప్పుడు విశాఖ నగరాన్ని చూసిన వారు ఎవరైనా హుద్ హుద్ తుఫాన్‌కు దెబ్బతిన్నది ఈ నగరమేనా?... అని ఆశ్చర్యపోతారు. అంతలా మారిపోయింది. స్మార్ట్ సిటీగా రూపాంతరం చెందింది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధానిగా పేరు తెచ్చుకుంది.



హనుమంతవాక జంక్షన్ ప్రస్తుతం



హుద్‌హుద్ తరువాత హనుమంతవాక జంక్షన్

విశాఖపట్నానికి తుఫాన్లు కొత్త ఏమీ కాదు. బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడి వాయుగుండంగా ఆపై తుఫాన్లుగా మారి ఎన్నోసార్లు ఇక్కడ తీరం దాటుతుంటాయి. ఆ వర్షాలకు పంటలు కోల్పోయి, ఇళ్లు కూలిపోయి బాధపడిన సందర్భాలు అనేకం. కానీ 2014 అక్టోబరు 12న వచ్చిన హుద్ హుద్ తుఫాన్ సాధారణమైనది కాదు. భారతదేశంలో 1891 తరువాత వచ్చిన 505 తుఫాన్లలో ఒక నగరాన్ని ఢీకొట్టిన తొలి పెను తుఫాన్. గంటకు 206 కి.మీ. వేగంతో వీచిన పెనుగాలులకు వేల సంఖ్యలో వృక్షాలు నేలకూలాయి. రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. జనజీవనం ... మిగతా 4వ పేజీలో



కొండల మీద నుంచి వచ్చిన వరద ధాటికి వంతెన కొట్టుకుపోవడంతో గాల్లోకి వేలాడుతున్న రైలు పట్టాలు (ఫైల్ ఫొటో)

హుద్‌హుద్‌తో కేకేలైన్ కకావికలం

- బొడ్డవర నుంచి అరకులోయ వరకు 18 చోట్ల పట్టాలపై విరిగిపడిన కొండచరియలు
- తైడా సమీపంలో కొట్టుకుపోయిన భారీ వంతెన
- నెల రోజులపాటు నిలిచిన రైళ్ల రాకపోకలు
- తూర్పుకోస్తా రైల్వేకు రూ.500 కోట్లకుపైగా నష్టం

అనంతగిరి, అక్టోబరు 11:
సరిగ్గా పదేళ్ల క్రితం సంభవించిన హుద్‌హుద్ పెనుతుఫాన్.. తూర్పుకోస్తా రైల్వేకు దండిగా ఆదాయం తెచ్చిపెట్టే కొత్తవలస- కిరండోల్ (కేకేలైన్) రైలు మార్గాన్ని కకావికలం చేసింది. ఐదు దశాబ్దాల కేకే లైన్ చరిత్రలో కనీవినీ ఎరుగనిరీతిలో హుద్‌హుద్ తుఫాన్ దెబ్బకు నష్టపోయింది. 2014 అక్టోబరు 12వ తేదీన ఉత్తరాంధ్రను కుదిపేసిన హుద్‌హుద్ ధాటికి కేకేలైన్ అతలాకుతలమైంది. విజయనగరం జిల్లా ... మిగతా 4వ పేజీలో

నాటు కోళ్లకు మహా గిరాకీ

పాడేరు వారపు సంతలో రెండు కిలోల కోడి రూ.2,500

- సాధారణ రోజుల్లో పెద్ద కోడి వెయ్యి రూపాయలే..
- దసరా పండుగ ప్రభావం



పాడేరు సంతలో నాటు కోళ్ల విక్రయిస్తున్న రైతు

పాడేరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):
దసరా పండుగతో శుక్రవారం స్థానిక వారపు సంతలో నాటు కోళ్లకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. దీంతో కేవలం రెండు కిలోల బరువుండే కోడి రూ.2,500లకు అమ్ముడుపోయింది. వాస్తవానికి గిరిజన ప్రాంతాల్లోని వారపు సంతల్లో పెద్ద నాటు కోడి వెయ్యి రూపాయలకు మించి ఉండదు. కానీ దసరా పండుగలో నాటు కోడిని కోయడం, తినడం సహజం కావడంతో అధిక శాతం జనం నాటు కోళ్ల కోసం వారం రోజుల నుంచి ఎగబడుతున్నారు. దీంతో వారపు సంతల్లో, గిరిజన పల్లెల్లో సైతం నాటు కోళ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మండలంలో గుత్తులపుట్టులో గురువారం జరిగిన వారపు సంతలో రెండు కిలోలుండే నాటు కోడిని రూ.1500 నుంచి రూ.2 వేలకు విక్రయిస్తే, అదే కోడిని శుక్రవారం పాడేరు వారపు సంతలో రూ.2,500లకు రైతులు విక్రయించారు. ధర అధికంగా ఉన్నప్పటికీ దసరా నేపథ్యంలో నాటుకోళ్లను కొనేందుకు జనం ఎగబడ్డారు.

బంతిపూలకు భలే డిమాండ్

భవానీ భక్తులు, దసరా పండుగ నేపథ్యమే కారణం

- బుట్టడు బంతి పువ్వులు రూ.200 నుంచి రూ.250
- కొనుగోలుకు ఎగబడిన వర్తకులు..
- గిరి రైతుల ఆనందం



పాడేరు సంతలో శుక్రవారం ఉదయం బంతి పువ్వుల క్రయవిక్రయాలు



రూ.250 ధర ఉండే బుట్టడు బంతి పువ్వులు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)
మన్యంలోని బంతి పూలకు భలే డిమాండ్ ఏర్పడింది. శుక్రవారం స్థానిక వారపు సంతలో కేవలం పది కిలోలు బరువుండే బుట్టడు బంతి పూవ్వులు రూ.200 నుంచి రూ.250లకు వర్తకులు కొనుగోలు చేశారు. దీంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు చెందిన గిరిజన రైతులు ప్రతి ఏడాది బంతి పువ్వులను సాగు చేస్తుంటారు. అక్టోబరు మొదటి వారం నుంచి దాదాపుగా డిసెంబరు మొదటి వారం వరకు పాడేరులో బంతి పువ్వుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ప్రస్తుతం అయ్యప్ప, భవానీ భక్తులు, దసరా పండుగ నేపథ్యంలో బంతి పువ్వులకు గిరాకీ ఉంది. బుట్టడు పువ్వుల ధర రూ.200 నుంచి రూ.250లకు గిరి రైతులు శుక్రవారం విక్రయించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వర్తకులు వాటి కొనుగోలుకు ఎగబడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తాజాదనం వల్లే మన్యం బంతికి డిమాండ్

ఏజెన్సీలో సహజ సిద్ధంగా సాగు చేసే బంతి పువ్వులకు ఇతర ప్రాంతాల్లో చాలా డిమాండ్ ఉంది. ఇతర ప్రాంతాల్లో పువ్వులు కోసిన రెండు, మూడు రోజుల్లో వాడిపోతాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని కొనుగోలు చేసిన పువ్వులను ఇతర ప్రాంతాల్లోని మార్కెట్‌లకు సకాలంలో రవాణా చేయకపోతే వర్తకులు తీవ్రంగా నష్టపోతారు. ఏజెన్సీలోని పువ్వులు అందుకు భిన్నంగా ఉంటాయి. కోసిన వారం రోజులు అయినా వాడిపోవు. దీంతో ఇక్కడ కొనుగోలు చేసిన పువ్వులను ఎక్కడికైనా ఎటువంటి అనుమానం లేకుండా రవాణా చేసుకోవచ్చు. అందువల్ల ఇతర ప్రాంతాల వర్తకులు మన్యంలోని బంతి పువ్వులను కొనుగోలు చేసేందుకు అమితంగా ఉత్సాహం చూపిస్తున్నారు. దీంతో గిరి రైతులకు ఆదాయం సమకూరుతున్నది.



శుక్రవారం సాయంత్రం లంబసింగిలో కురుస్తున్న మంచు

లంబసింగిలో స్నోయగం

చింతపల్లి, అక్టోబరు 11: ఆంధ్రకశ్మీర్ లంబసింగిలో గురు, శుక్రవారాల్లో శీతాకాలం వాతావరణం నెలకొంది. రెండు రోజులుగా ఉదయం, సాయంత్రం మంచు దట్టంగా కురుస్తున్నది. సాధారణంగా నవంబరులో ఈ తరహా వాతావరణం లంబసింగిలో కనిపిస్తుంది. అయితే ఈ ఏడాది అక్టోబరులోనే శీతాకాల వాతావరణం ఆవిష్కృతమైంది. ఉదయం తొమ్మిది గంటల వరకు.. సాయంత్రం నాలుగు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం వరకు మంచు కురుస్తున్నది. లంబసింగి మంచు అందాలను పర్యాటకులను ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

పాతపాడేరులో దసరా ఉత్సవాలు ప్రత్యేకం

- ఏడుగురు పూజారులతో ప్రత్యేక పూజలు

- 4లో

538 కిలోల గంజాయి స్వాధీనం

చింతలవీధి జంక్షన్‌లో బురదలో కూరుకుపోయిన కారు

- వాహనం వదిలి వెళ్లిన స్మగ్లర్లు
- లభ్యమైన గంజాయి విలువ రూ.27 లక్షలు
- పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు
- దారి తప్పడంతో పట్టుబడి వైనం

పాడేరురూరల్, అక్టోబరు 11:
మండలంలోని చింతలవీధి జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం బురదలో కూరుకుపోయిన కారులో 538 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ డి.దీనబంధు తెలిపారు. అనంతరం కారును పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు ఆయన చెప్పారు. సీఐ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

మన్యం నుంచి మైదాన ప్రాంతానికి గంజాయిని తరలిస్తున్న కారు శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో చింతలవీధి జంక్షన్ సమీపంలో నిలిచిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి ఎస్ఐ ఎ.సూర్యనారాయణ, సిబ్బంది వెళ్లారు. బురదలో కూరుకుపోయిన కారును బయటకు తీసి మెకానిక్‌ల సాయంతో మధ్యవర్తుల సమక్షంలో కారు డోర్‌లను తెరిచి పరిశీలించారు. కారులో 538 కిలోల గంజాయి ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకొని కారును పోలీసు స్టేషన్‌కు తరలించామని సీఐ దీనబంధు తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ. 27 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



కారులో నుంచి గంజాయిని బయటకు తీస్తున్న పోలీసులు

దారి తప్పడంతో కారు చిక్కింది..

మన్యం నుంచి మైదాన ప్రాంతానికి కారులో గంజాయిని తరలించే స్మగ్లర్లు మార్గం మరచిపోవడంతో చిక్కినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో అరకు ప్రధాన రహదారి నుంచి శరవేగంగా వచ్చిన కారు అడారిమెట్ట జంక్షన్ నుంచి ఎడమ చేతివైపు ... మిగతా 4వ పేజీలో

గర్భిణులకు అందుబాటులోకి వైద్య సేవలు



గర్భిణికి ఆరోగ్య తనిఖీలు చేస్తున్న గైనకాలజిస్టు

చింతపల్లి, అక్టోబరు 11: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. శుక్రవారం విధులకు హాజరైన కోటవురట్ల గైనికాలజిస్టు డాక్టర్ ఝాన్సీరాణి 72 మంది గర్భిణులకు వైద్యసేవలందించారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేశారు. ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టు సేవలు అందు బాటులోకి రావడంతో గర్భిణులు, బాలింతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గురువారమే మైదాన ప్రాంత గైనికాల జిస్టులు రావలసి ఉంది. కానీ ఎవరూ రాకపోవడంతో 'గర్భిణు లకు తప్పని అవస్థలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురి తం కావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. దీంతో కోటవురట్ల గైనికాలజిస్టు డాక్టర్ ఝాన్సీరాణి శుక్రవారం ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలందించారు.మైదాన ప్రాంతాల నుంచి గైనికాలజిస్టుల నియామకానికి కృషిచేసిన జిల్లా కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, 'ఆంధ్రజ్యోతి'కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రభావతి తెలిపారు. దసరా అయినప్పటికీ శనివారం మధ్యాహ్నం వరకు గర్భిణులు, గైనికాలజిస్టు అందించనున్నారు.

విద్యుత్ వైర్లతో వేటాడితే చర్యలు: ఎస్ఐ

జి.మాడుగుల, అక్టోబరు 11: ఆటవీ సంచార ప్రదేశాల్లో విద్యుత్ వైర్లతో అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన వుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమంగా విద్యుత్ వైర్లు అమర్చడం వల్ల ప్రజల ప్రాణాలకు ప్రమాదమని చెప్పారు. వైర్లతో వేటాడితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.




ఏపీ కాంగ్రెస్ కమిటీ ఎస్టీ సెల్ చైర్మన్‌గా నవభారత్



చింతపల్లి, అక్టోబరు 11: ఏపీ కాంగ్రెస్ కమిటీ ఎస్టీ సెల్ చైర్‌పర్సన్‌గా రీమల నవభారత్‌ను నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వెణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన నవభారత్ ఐఐటీ బీటెక్ పూర్తి చేసి కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. ఆయన సేవలను గుర్తించిన ఏఐసీసీ ఏపీ కాంగ్రెస్ కమిటీ ఎస్టీసెల్ చైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ సందర్భంగా నవభారత్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని, వచ్చే ఎన్నికల్లో షెడ్యూల్డ్ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

పాతపాడేరులో దసరా ఉత్సవాలు ప్రత్యేకం

▸▸ ఏడుగురు పూజారులతో ప్రత్యేక పూజలు



స్వయంభూ.. కనకదుర్గమ్మ.. మొగలిదుర్గమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు చేసిన ఏర్పాట్లు

పాడేరు రూరల్, అక్టోబరు 11: జిల్లా కేంద్రం పాత పాడేరు గ్రామంలో దసరా ఉత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. పాత పాడేరు స్వయంభూ, కనకదుర్గ, మొగలిదుర్గ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది భవానీ భక్తులతో ఆలయంలో మరింత శోభ ఏర్పడింది. పాడేరు నలుమూలల నుంచి దసరా రోజున భక్తులు అధిక సంఖ్యలో హాజరై వారి వాహనాలకు ఇక్కడ ప్రత్యేక పూజలను చేయించుకుంటారు. ఈ ఆలయంలో ఏడుగురు దేవతలు వెలిశారన్నది ప్రజల నమ్మకం. దసరా రోజు ఏడుగురు అమ్మవార్లకు ఏడుగురు పూజారులు భక్తిశ్రద్ధలతో చేస్తారు. దసరా ఉత్సవాలు ఏజెన్సీలో ఎక్కడా ఈ విధంగా నిర్వహించరు. పాత పాడేరులో వెలసిన అమ్మవారి ఆలయం వద్ద నిర్వహిస్తారు. కిల్లు దుర్గపూజారి, గిడ్డి జవ్వాది, పలాసి, అల్లంగి దేశిది అనే కుటుంబాలకు చెందిన వారు గ్రామ ఆచారం ప్రకారం పూజలను నిర్వహిస్తారు. విజయదశమి రోజు చేపట్టే ఈ పూజలను తిలకించేందుకు మన్యంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు



కొయ్యూరులో నవరాత్రి సంబరాలలో బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కొయ్యూరు, అక్టోబరు 11: మండల కేంద్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కొయ్యూరు వరాహగిరిపై వెలసిన కనకదుర్గ ఆలయంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ఎంవీవీ ప్రసాద్, అనిశెట్టి చిరంజీవి ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా అమ్మవారికి శాస్త్రోక్తకంగా పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారు గురువారం దుర్గాదేవి అవతారంలో దర్శనమివ్వగా, రాత్రి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని బతుకమ్మ బోనాలను సమర్పించుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అమ్మవారి పడి పూజను నిర్వహించారు. అలాగే శుక్రవారం కమిటీ సభ్యులు చిరంజీవి, దొరబాబు, రాజశేఖర్, దేముడు, వీరయ్యదొర, మేడిబోయిన చక్రరావు, సరస్వతి, లక్ష్మీతో పాటు గ్రామస్తుల సహకారంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలతో గడిచిన తొమ్మిది రోజులుగా కొయ్యూరులో పండగ వాతావరణం కనపిస్తున్నది.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

అనంతగిరి, అక్టోబర్ 11: మండలంలోని ఎగువశోభ పంచాయతీ కేంద్రంలోని రూ.4.5 లక్షలు జడ్పీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు శంకుస్థాపన చేశారు. జడ్పీ నిధులతో పెద్ద ఎత్తున మారుమూల గిరిజన గ్రామాలను అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీపీ. జడ్పీటీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింహాద్రి, నాయకులు సుబ్బారావు, శాంతిరావు తదితరులు పాల్గొన్నారు.

ధారకొండలో వీధి దీపాల ఏర్పాటు

సీలేరు, అక్టోబరు 11: ధారకొండ పంచాయతీ పరిధిలోని ఏనుగుబైలు, ధారకొండకాలనీ, చీడిగుంట గ్రామాల్లో శుక్రవారం వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఇటీవల ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వీధి దీపాలు కాలిపోయి చీకటి అలముకుంది. సమస్యను సర్పంచ్ నడిగట్ల రాజు దృష్టికి స్థానికులు తీసుకురావడంతో శుక్రవారం సిబ్బందితో కొత్త దీపాలను ఏర్పాటు చేయించారు.

వన్య ప్రాణులను వధించడం నేరం

పెదబయలు, అక్టోబరు 11: వన్య ప్రాణులను వధించడం నేరమని ఎస్ఐ కె.రమణ తెలిపారు. శుక్రవారం సీకరి పంచాయితీలో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడారు. పంటలు జంతువుల బారిన పడకుండా విద్యుత్ తీగలను రైతులు అమర్చడంతో ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయని వాపోయారు.







మెగా వాలీబాల్ టోర్నమెంట్ విన్నర్ దొరవలస

అరకులోయ, అక్టోబరు 11: మండల కేంద్రంలో నిర్వహించిన మెగా వాలీబాల్ టోర్నమెంట్‌లో అరకులోయ మండలం దొరవలస జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో లమతంపాడుపై దొరవలస జట్టు విజయం సాధించింది. మూడో స్థానంలో పెదబయలు మండలం తూటంగి టీం నిలిచింది. విజేత జట్లకు వాలీబాల్ గ్రౌండ్‌లో మెమెంటోలతో పాటు నగదు బహుమతిలను ఎమ్మెల్యే రేగం మత్సలింగం, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, పెదలబుడు ఎంపీటీసీ సభ్యుడు ఎల్‌బీ.భీమరాజు అందజేశారు. క్రీడా స్ఫూర్తితో మూడు రోజులు పాటు జరిగిన టోర్నమెంట్‌లో ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల నుంచి 36 జట్లు పాల్గొన్నట్టు టోర్నమెంట్ నిర్వాహకులు బురిడి ఆనందరావు, పోలు తెలిపారు. టోర్నీ రిఫరీలుగా అప్పలరాజు, లైకోన్, బాలీ నరసింగ్ వ్యవహరించారు.

వాలీబాల్ గ్రౌండ్‌కు పూర్వ వైభవంతో పాటు అన్యాక్రాంతం కాకుండా నిర్వహణ కమిటీ బృందం కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం సూచించారు

మన్యంలో పచ్చదనాన్ని హరించిన తుఫాన్

... 1వ పేజీ తరువాయి


మండల పరిధిలోని మత్స్యగెడ్డ వంతెన అప్రోచ్ కొట్టుకు పోయింది.

కాఫీ రైతులకు రూ.29 కోట్లు నష్టపరిహారం

ఏజెన్సీలో హుద్‌హుద్ తుఫాన్ ప్రభావం అధికంగా కాఫీ తోటలపైనే పడింది. కాఫీ మొక్కలకు నీడ నిచ్చే సిల్వర్‌ఓక్ చెట్లు నాశనమయ్యాయి. ఆ చెట్ల కింద ఉన్న కాఫీ తోటలు పాడయ్యాయి. ఏజెన్సీ వ్యాప్తంగా 31 వేల 50 మంది రైతులకు చెందిన 37,665 ఎకరాల్లో కాఫీ తోటలకు నష్టం వాటిల్లిందని అధికారులు గుర్తించారు. అలాగే కాఫీ తోటలను నష్టపోయిన రైతులకు రూ.29 కోట్ల 3 లక్షలను పరిహారాన్ని ప్రభుత్వం అందించింది. అలాగే తుఫాన్‌లో నష్టపోయిన కాఫీ రైతుల తోటలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. అందులో భాగంగా ఎకరానికి 200 కాఫీ మొక్కలు, 200 సిల్వర్‌ఓక్, 100 మిరియాల మొక్కలు, ఇతర నీడ నిచ్చే మొక్కలు 100 చొప్పున బాధిత కాఫీ రైతులకు అందించింది. దీంతో కాఫీ రైతులు కోలుకున్నారు.

బాధితులకు రూ.7 లక్షల చొప్పున పరిహారం

అరకులోయ మండలం మాదల పంచాయతీ మేదరశాల గ్రామంలో హుద్‌హుద్ తుఫాన్‌కు ఒక గిరిజన కుటుంబానికి చెందిన ఇల్లు కూలిపోయింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. దీంతో ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు చొప్పున, కేంద్ర ప్రభుత్వం రూ.రెండు లక్షలు చొప్పున నష్టపరిహారంగా అందించాయి. అలాగే మేదరశాల వాసులకు పక్కా ఇళ్లను అధికారులు నిర్మించారు.







హుద్‌హుద్‌తో కేకేలైన్ కకావికలం

... 1వ పేజీ తరువాయి

బొడ్డవర నుంచి అరకులోయ వరకు 18 చోట్ల కొండచరియలు విరిగిపడగా, తైడా రైల్వేస్టేషన్‌కు సమీపంలో 18వ నంబరు టన్నెల్‌కు చేరువలో కొండచరియలతోపాటు ఒక్కసారిగా ఉబికిన వరద ఉధృతికి వంతెన సుమారు కిలోమీటరు దూరం కొట్టుకుపోయింది. దీనిని పునర్నిర్మించడానికి రైల్వే యంత్రాంగం నెల రోజులపాటు కష్టపడాల్సి వచ్చింది. ఇందుకోసం ఉపయోగించిన ఐరన్ గడ్డర్‌లను మహారాష్ట్ర నుంచి రప్పించారు. వందలాది మంది కూలీలతోపాటు యంత్రాలను ఉపయోగించి రేయింబవళ్లు పనులు చేసి, నెల రోజులకు రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. అక్టోబరు 12వ తేదీన నిలిచిన రైళ్ల రాకపోకలు... నవంబరు 11వ తేదీన పునరుద్ధరణకు నోచుకున్నాయి. దాదాపు నెల రోజులపాటు గూడ్స్ రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో పాటు రైల్వే ట్రాక్‌లు ధ్వంసం కావడంతో తూర్పుకోస్తా రైల్వేకు రూ.500 కోట్ల మేర నష్టం వాటిల్లింది.

విపత్తుపై విజయం

... 1వ పేజీ తరువాయి

స్తంభించిపోయింది. మూడు రోజులు ఉత్తరాంధ్ర మొత్తం కటిక చీకటిలో కాలం గడిపింది. ఆ చీకటిలోనే వెలుగు రేఖలా రాత్రికి రాత్రి విశాఖపట్నం చేరుకున్నారు నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. వారం, పది రోజులు పాటు ఇక్కడే ఉండి ప్రజలకు అవసరమైనవన్నీ సమకూర్చి, జనజీవనం మళ్లీ సాధారణ స్థాయికి చేరిన తరువాతే విజయవాడ తిరిగి వెళ్లారు. విశాఖపట్నం చరిత్రను తిరగ రాయడానికే ఆ తుఫాన్ వచ్చిందా?... అన్నట్టు నగరం ఇప్పుడు అభివృద్ధి సాధించింది.

హుద్‌హుద్ తుఫాన్ దెబ్బకు కైలాసగిరి తీవ్రంగా దెబ్బతింది. కొండపైన ఘాట్‌రోడ్డు ధ్వంసమైంది. రాకపోకలు నిలిచిపోయాయి. విశాఖపట్నం విమానాశ్రయం పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. కొన్నిరోజులపాటు విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే స్టేషన్ పైకప్పులు ఎగిరిపోయాయి. పదుల సంఖ్యలో రైళ్లు రద్దయ్యాయి. పునరుద్ధరణకు చాలా సమయం పట్టింది. హిందూస్థాన్ షిప్‌యార్డుకు చెందిన ఆస్తులకు భారీ నష్టం వాటిల్లింది. డ్రైడాక్ పూర్తిగా ధ్వంసమైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం యూనివర్సిటీ, కింగ్ జార్జి ఆస్పత్రులకు నష్టం వాటిల్లింది. టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థ ఛిన్నాభిన్నం అయింది. ప్రభుత్వ అంచనాల ప్రకారం రూ.22 వేల కోట్ల నష్టం జరిగినట్టు లెక్క తేల్చారు. ఇప్పుడు విశాఖను ఎవరైనా చూస్తే హుద్‌హుద్ వచ్చిన నగరం ఇదే అంటే ఎంత మాత్రం నమ్మరు. ఎందుకంటే అంత అభివృద్ధిని సాధించింది.







మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

... 1వ పేజీ తరువాయి

పాడేరులోని 4 షాప్‌లకు, అరకులోయలోని నాలుగు షాప్‌లకు సిండికేట్‌లు సగటున 25 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. అలాగే చింతపల్లి స్టేషన్ పరిధిలో 6 షాప్‌లకు 141, రంపచోడవరంలో 10 షాప్‌లకు 260 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఒక్కోక్క దుకాణం మాత్రమే ఉన్న కూనవరంలో 62, కొయ్యూరులో 46, ముంచంగిపుట్టులో 45, అనంతగిరిలో 36, హుకుంపేటలో 45, డుంబ్రిగుడలో 24, మారేడుమిల్లిలో 47 దరఖాస్తులు రావడం విశేషం. జిల్లాలో పెదబయలు, జి.మాడుగుల మినహాయిస్తే ఇతర ప్రాంతాల్లో వైన్‌షాప్‌ల కోసం పోటీ అధికంగానే ఉంది.

538 కిలోల గంజాయి స్వాధీనం

... 1వ పేజీ తరువాయి



చింతలవీధి జంక్షన్ వద్ద గంజాయితో నిలిచిపోయిన కారు

రూట్‌లో వెళ్లాల్సి ఉండగా.. మరి కాస్త ముందుకు వచ్చి కుడిచేతి వైపు గల పెదబయలు రహదారిలోకి వెళ్లారు. వెళ్లాల్సిన రూట్ కాదని వారి వెనుకనే ఉన్న మరో కారులో వ్యక్తులు చెప్పడంతో వాహనాన్ని శరవేగంగా వెనక్కి తిప్పే ప్రయత్నంలో బురదలో కూరుకుపోయింది. దీంతో వాహనాన్ని విడిచి కారులో ఉన్న నలుగురు వ్యక్తులు దిగి అక్కడ నుంచి వేరే కారులో పరారయ్యారు. వాహనం సమాచారాన్ని స్థానికులు ఉదయం 8 గంటల సమయంలో పోలీసులకు ఇవ్వడంతో వారు వచ్చి గంజాయి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే వాహనాలు వచ్చే వేగం.. మలుపులో వెళ్లే తీరు చింతలవీధి జంక్షన్‌లో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. వాటి ఆధారంగా గంజాయి స్మగ్లర్లను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.







క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నక్కపల్లి, అక్టోబరు 11: మండలంలోని సారిపల్లివానిపాలెం హైవే జంక్షన్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి విశాఖ కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ మృతిచెందినట్టు ఏఎస్‌ఐ సత్యనారాయణ చెప్పారు. సారిపల్లివానిపాలెం గ్రామానికి చెందిన మామిడి నూకరాజు(55) ఈ నెల 3వ తేదీన బైక్‌పై వెళుతుండగా కారు ఢీకొన్నది. తీవ్రంగా గాయపడిన అతనిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ చెప్పారు..

సైకిల్ పైనుంచి పడి వృద్ధుడి మృతి

అచ్యుతాపురం, అక్టోబరు 11: సైకిల్ మీద వెళుతున్న వృద్ధుడు ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడని సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. మునగపాక మండలం కొత్త నాగవరం గ్రామానికి చెందిన కూనిశెట్టి అప్పారావు(61) గురువారం రాత్రి భోజనం చేసిన తరువాత మందులు కొనుక్కోవడానికి సైకిల్‌పై ఇరువాడ వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అచ్యుతాపురం-గాజువాక ప్రధాన రహదారిలో ఇరువాడ-నాగవరం మధ్య రోడ్డు పక్కన విగతజీవిగా కనిపించాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గణేశ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు సైడు భాగం

పరవాడ, అక్టోబరు 11 : ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. పరవాడ సంతబయలు సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.

గాజువాక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రూట్ నంబరు 400 వై ఎలమంచిలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ప్రయాణికులతో బయలుదేరింది. సరిగ్గా పరవాడ సంతబయలు సమీపంలోకి వచ్చేసరికి అదే రహదారిలో ఇసుకలోడుతో వెళ్తున్న లారీ బస్సును ఢీకొంది. ఈ సంఘటన జరిగినప్పుడు బస్సులో 63మంది ప్రయాణికులు ఉన్నారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. బస్సు ఓ వైపు కొంతమేర ధ్వంసమైంది. ప్రయాణికులను వేరొక బస్సులో గమ్యస్థానాలకు చేరవేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రానికి పూర్వ వైభవం

» మాజీ ఎమ్మెల్సీ నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారి న రాష్ట్రానికి పూర్వవైభవం తెచ్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నా రని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్రం లో పరిశ్రమల ఏర్పాటు ప్రగతిపై శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడుస్తుందని, ఇందు లోభాగంగా చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌ల కృషితో త్వరలో రాష్ట్రాని కి పారిశ్రామికవేత్తలు రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు.

వినోద్‌రాజును పరామర్శించిన కూటమి నేతలు



మాజీఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజును పరామర్శిస్తున్న కూటమి నాయకులు

ఎస్. రాయవరం, అక్టోబరు 11: మండలంలోని పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, టీడీపీ నేత యేజెర్ల వినోద్‌రాజును శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు ఎన్. వెంకటరాజు, సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, జనసేన మండల నేత చిరంజీవి, నక్కపల్లి మండల టీడీపీ నేత కొప్పిశెట్టి బుజ్జి పరామర్శించారు. వినోద్‌రాజు తన ఇంటిలో ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో ఆయన కాలుకి గాయం అయ్యింది. దీంతో విషయం తెలుసుకున్న నాయకులు ఆయన్ని పరామర్శించారు.

పరవాడలో 11 షాపులకు 101 దరఖాస్తులు

పరవాడ, అక్టోబరు 11 : మండలం నుంచి 11 మద్యం షాపులకు 101 దరఖాస్తులు వచ్చా యి. ఒక్కో షాపునకు యావరేజ్‌గా తొమ్మిది దరఖాస్తులు వచ్చాయి. 24 నంబరు షాపునకు తొమ్మిది దరఖాస్తులు రాగా, 25, 26, 27 నంబరు గల షాపులకు పదేసి చొప్పున దరఖాస్తులు, 28, 29, 30, 31, 32, 33 షాపులకు తొమ్మిదేసి చొప్పున దరఖాస్తులు, 34 నంబరు గల షాపునకు 11 దరఖాస్తులు వచ్చాయి. గతంలో దేశపాత్రునిపాలెం, లంకెలపాలెంలలో రెండేసి చొప్పున నాలుగు షాపులు ఉండేవి. అయితే ప్రస్తుతం అవి జీవీఎంసీ పరిధిలోకి కేటాయించారు. దీనికితోడు జీవీఎంసీకి ఐదు కిలోమీటర్ల లోపు ఉన్న పరవాడ, కలపాక, తానాం షాపులకు కూడా జీవీఎంసీ పరిధిలోని వీటి కేటాయింపు జరిగింది. అర్బన్ పరిధిలో లైసెన్స్ ఫీజుకు రూ. 85 లక్షలు, రూరల్ పరిధిలో రూ. 65 లక్షలు చెల్లించాల్సి ఉంది. దీంతో పరవాడ మండలం నుంచి దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. రూ. 85 లక్షలు లైసెన్సు ఫీజు చెల్లించి షాపులు పెట్టేందుకు ఇక్కడ వెనుకాడుతున్నారు. అలాగే గతంలో పరవాడ ఏరియాలో వ్యాపారం చేసిన కొంత మంది సిండికేటుగా ఏర్పడ్డారు.

అరకులోయలో బెంగాలీ పర్యాటకుల సందడి

అరకులోయ, అక్టోబరు11: అరకులోయలో దసరా సెలవులు సందర్భంగా బెంగలీ పర్యాటకులు సందడి చేశారు. అక్టోబరు మొదటి వారం నుంచే బెంగాలీ పర్యాటకులు పెద్ద ఎత్తున సందర్శించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ దఫా కొంత ఆలస్యం అయినప్పటికీ బెంగాలీ పర్యాటకులు ఓ మోస్తరుగా అరకులోయకు రావడంతో సందడి ప్రారంభమైంది. అరకులోయలోని మ్యూజియం, కళాగ్రామం, స్కై సైక్లింగ్, బోటుషికారు, జిప్‌లైనర్‌లో, పద్మాపురం గార్డెన్‌లను పెద్ద ఎత్తున సందర్శించారు. హోటళ్లు, రిసార్టులు, అన్నీ పర్యాటకులతో కళకళలాడుతూ కనిపించాయి. చిరువ్యాపారులకు వ్యాపారం జరిగింది. టాక్సీ, ఆటోవాలాలకు వ్యాపారం జరిగింది. శుక్రవారం సంత కావడంతో అరకులోయ పట్టణం సందడిగా ఉంది.

అమ్మవారి సన్నిధిలో హోమం, కుంకుమార్చన

సీలేరు, అక్టోబరు 11: జీకేవీధి మండలం సీలేరులో నిర్వహిస్తున్న 34వ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో శుక్రవారం అమ్మవారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో హోమం, కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హోమం, సామూహిక కుంకుమార్చనలో సీలేరు, పరిసర గ్రామాలకు చెందిన మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ధారకొండలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	118.00
లైవ్ ధర	138.00
విత్ స్కిన్	246.00
స్కిన్ లెస్	256.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529



ప్రకృతి అందాలతో కనువిందు చేస్తున్న రైవాడ జలాశయం

ప్రకృతి అందాల కనువిందు!

మన్యంలో ప్రకృతి అందాలకు కొదవలేదు. అనంతగిరి మండలంలోని జీనబాడు-పెదకోట మధ్యలో నిండుగా కళకళలాడుతున్న రైవాడ జలాశయం, చుట్టూ కొండలు చూపరుల మదిని దోచేస్తున్నాయి. - అనంతగిరి

అచ్యుతాపురం సంతలో దసరా సందడి

» భారీగా గొర్రెలు, నాటుకోళ్ల అమ్మకాలు
» 30 శాతం వరకు పెరిగిన ధరలు

అచ్యుతాపురం, అక్టోబరు 11: దసరా సందర్భంగా అచ్యుతాపురంలో శుక్రవారం జరిగిన సంత గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల అమ్మకాలతో సందడిగా మారింది. దసరా పండుగ కావడంతో పెంపకందారులతోపాటు కొనుగోలుదారులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చారు. సాధారణ రోజులతో పోలిస్తే గొర్రెలు, నాటుకోళ్ల ధరలు 30 శాతంపైగా పెరిగాయి.



అచ్యుతాపురం సంతలో గొర్రెలు



సంతలో అమ్మకానికి తీసుకువచ్చిన నాటుకోళ్లు

ప్రతి శుక్రవారం అచ్యుతాపురంలో భారీగా సంత జరుగుతుంది. ముఖ్యంగా పశువులు, గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల అమ్మకాలు, కొనుగోళ్లకు ఈ సంత ప్రసిద్ధి చెందింది. దీంతో ఎలమంచిలి నియోజకవర్గంతోపాటు అనకాపల్లి, విశాఖ, విజయనగరం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కూడా కొనుగోలుదారులు వస్తుంటారు. దసరా, సంక్రాంతి పండుగల ముందు జరిగే సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు ఎక్కువగా అమ్ముడుపోతుంటాయి. శుక్రవారం జరిగిన సంతకు వేల సంఖ్యలో నాటు కోళ్లు, వందలాది మేకలు, గొర్రెలను తీసుకువచ్చి విక్రయించారు. సాధారణ రోజులతోపోలిస్తే మేకలు, గొర్రెలు రూ.1,500 నుంచి రూ.2,500 వరకు అధికంగా ధర పలికాయి. గత వారం సుమారు రెండు కేజీల బరువున్న నాటుకోడి రూ.1,600లకు విక్రయించగా, ఈ వారం రూ.2,100కు విక్రయించారు.

సబ్‌డివిజన్‌లో నాలుగు మల్టీపర్పస్ భవనాలు

» జన్‌మన్ పథకంలో రూ.2.24 కోట్లు మంజూరు
» టీడబ్ల్యూ డీఈఈ రఘునాధరావు నాయుడు


చింతపల్లి, అక్టోబరు 11: సబ్ డివిజన్ పరిధిలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో రూ.2.24కోట్లతో నాలుగు మల్టీపర్పస్ భవనాలు మంజూరయ్యాయని స్థానిక గిరిజన సంక్షేమ శాఖ డీఈఈ రఘునాధరావు నాయుడు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. జన్‌మన్ పథకం నిధులతో గానుగువీధి, రాజుబంద, లబ్బంగికొత్తవీధి, వంట్లమామిడి గ్రామాల్లో మల్టీపర్పస్ భవనాలు నిర్మించనున్నామన్నారు. ఒక్కొక్క భవనం నిర్మాణానికి రూ.60లక్షలు కేటాయించినట్టు చెప్పారు. ఈ భవనాల నిర్మాణాలు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. చింతపల్లిలో రూ.1.1కోట్ల ఎస్‌సీఏ నిధులతో శిక్షణ కేంద్రం నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ భవనం నిర్మాణాలు 70 శాతం పూర్తి చేశామన్నారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. కొయ్యూరు మండలంలో రూ.8కోట్ల ఆర్టికల్ 27 నిధులతో బచ్చెంత-వాలమామిడి గ్రామాలకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామన్నారు. తాండవ ఆశ్రమ పాఠశాలలో రూ.3.5కోట్లతో అదనపు తరగతి భవనాలు నిర్మించనున్నామన్నారు. అలాగే లంబసింగి స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ ఏడాది చివరి నాటికి మ్యూజియం పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. సమావేశంలో ఏఈఈలు యాదకిశోర్, శ్రీవిద్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ రఘునాధరావు నాయుడు

ఆకట్టుకున్న దుర్గాదేవి దీపారాధన

ఎస్. రాయవరం, అక్టోబరు 11: మండలంలోని వేమగిరి గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపం వద్ద శుక్రవారం గ్రామస్థులు దీపారాధన నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన కూరపాటి దుర్గ సుమారు 18 అడుగుల కనకదుర్గమ్మ వారి చిత్రాన్ని గీసి, దానిపై రకరకాల రంగులు అద్ది ప్రమిదుల దీపాలను వెలిగించారు. ఆ దీపాల కాంతుల్లో అమ్మవారి రూపం అద్భుతంగా భక్తులకు దర్శనమిచ్చింది. సుమారు ఐదు గంటలపాటు శ్రమించి కనకదుర్గమ్మ చిత్రాన్ని గీసినట్టు దుర్గ తెలిపారు.



వేమగిరిలో దుర్గాదేవి రూపంలో ఆకట్టుకుంటున్న దీపారాధన

భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మ ఊరేగింపు



అమ్మవారి ఊరేగిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 11 : స్థానిక లక్ష్మీదేవిపేటలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు రత్నాకర్‌ను ఘనంగా సత్కరించారు. రథంపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని రత్నాకర్ ప్రారంభించారు. దారి పొడవున అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అలాగే విగ్రహ దాతలు కొణతాల వాసు, దొడ్డి రాము, ముప్పన లింగేశ్వరరావుల ఇళ్ల వద్ద నుంచి అమ్మవారికి భారీ ఎత్తున సారె ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ క మిటీ ప్రతినిధులు రాయవరపు జోగిరాజు, పొలమరశెట్టి విజయ్‌కుమార్, నందా బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు సంతకు పోటెత్తిన చిలగడ దుంపలు

25 కిలోలు రూ.400కు విక్రయం

పాడేరు, అక్టోబరు 11 (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం జరిగిన వారపు సంతకు చిలగడ దుంపలు పోటెత్తాయి. ఊహించని విధంగా పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాలకు చెందిన గిరిజన రైతులు దుంపలను అధికంగా సంతకు తీసుకువచ్చారు. సుమారు పది టన్నుల వరకు దుంపలు వచ్చినట్టు వర్తకులు అంచనా వేస్తున్నారు. మైదాన ప్రాంతాలైన అనకాపల్లి, నర్సీపట్నం, తుని, కాకినాడ, రాజమండ్రి, తాడెపల్లిగూడెం ప్రాంతాలకు చెందిన వర్తకులు పాడేరు వచ్చి గిరిజన రైతుల నుంచి ఈ దుంపలను కొనుగోలు చేసి తమ వాహనాల్లో మైదాన ప్రాంతానికి తరలించుకుపోతున్నారు. 25 కిలోలు బరువు ఉండే (గంపడు) దుంపలను రూ.400 చొప్పున వర్తకులు శుక్రవారం కొనుగోలు చేశారు. ఇక్కడ తమ వద్ద కొనుగోలు చేసిన దుంపలను ఉత్తర భారతదేశంలోని పలు మార్కెట్‌లకు ఎగుమతి చేస్తారని గిరిజన రైతులు తెలిపారు. అలాగే ఈ దుంపలకు ఉత్తర భారతదేశంలో డిమాండ్ ఉందని వర్తకులు అంటున్నారు.



పాడేరు సంతకు రైతులు తీసుకువచ్చిన చిలగడ దుంపలు



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఉపమాక ఆలయం

విజయదశమి వేడుకలకు వెంకన్న ఆలయం ముస్తాబు

నక్కపల్లి, అక్టోబరు 11: మండలంలోని ఉపమాక క్షేత్రం విజయదశమి వేడుకలకు ముస్తాబైంది. దసరా ఉత్సవాలు సందర్భంగా అశ్వీయుజమాసం ప్రారంభం నుంచి పది రోజులపాటు ఆలయంలో పలు పూజా కార్యక్రమాలు, తిరువీధి సేవలు జరుగుతుంటాయి. శనివారం విజయదశమి రోజున శమీ పూజ, వినోద ఉత్సవం నిర్వహిస్తారు. దశమి ముందు రోజున మృగవేటకు వెళ్లిన స్వామివారు అత్తింటి వారిచ్చిన అంగుళీకరణాన్ని జారవిడుచుకుంటారు. మృగవేట అనంతరం తిరిగివెళ్లిన స్వామివారిని, తన పుట్టింటి వారిచ్చిన ఉంగరమేది? ఎవరికిచ్చారు? అని నిలదీస్తారు. దీంతో పారేసుకున్న ఉంగరాన్ని వెతకడానికి స్వామివారు తిరిగి వెళతారు. వినోద ఉత్సవంగా పిలిచే ఈ సన్నివేశాలను ఆలయ అర్చకుల పరివారం కళ్లకు కట్టినట్టు ఎంతో రసవత్తరంగా నిర్వహిస్తుంది. వినోద ఉత్సవం శనివారం మధ్యాహ్నం మాడవీధుల్లో జరుగుతుంది.

మహిషాసురమర్దిని అవతారంలో దుర్గమ్మ

నర్సీపట్నం, అక్టోబరు 11: స్థానిక దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం విజయ దశమి సందర్భంగా ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు, పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణలో 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మహిషాసుర మర్దిని అవతారంలో దుర్గమ్మ

లోకేశ్‌ను కలిసిన తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 11: రాష్ట్ర హెచ్‌ఆర్‌డీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమను చైర్మన్‌లుగా నియామకానికి సహకరించినందుకు ఇరువురు కృతజ్ఞతలు తెలిపారు. వారితోపాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉన్నారు.



మంత్రి లోకేశ్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్న పీలా గోవింద, బత్తుల తాతయ్యబాబు, పల్లా శ్రీనివాసరావు

బాధ్యతగా పనిచేస్తే మంచి అవకాశాలు

సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ శివదత్‌కు హోం మంత్రి అనిత సూచన

నక్కపల్లి, అక్టోబరు 11 : తొలిసారిగా సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన పార్టీ రాష్ట్ర సెక్రటరీ బోడపాటి శివదత్‌ను శుక్రవారం హోం మంత్రి వంగలపూడి అనిత అభినందించారు. శుక్రవారం విజయవాడలోని హోంమంత్రిని ఆమె నివాసంలో శివదత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు అనిత పలు సూచనలు చేశారు. గడచిన ఐదేళ్లలో సివిల్ సప్లయి విభాగం నిర్వీర్యమైపోయిందని, ఈసారి నాణ్యమైన సేవలు ప్రజలకు అందేలా కృషి చేయాలన్నారు. దక్కిన అవకాశాన్ని బాధ్యతగా తీసుకుని, అంకితభావంతో పనిచేస్తే మంచి ఫలితం వుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా అనితకు శివదత్ కృతజ్ఞతలు తెలిపారు.



హోం మంత్రి అనితను కలిసి శివదత్

అంతాడలో స్వచ్ఛత హీ సేవ

కొయ్యూరు, అక్టోబరు 11: పరిసరాల పరిశుభ్రతతోనే అంటు వ్యాధులకు చెక్ పెట్టవచ్చని అంతాడ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సర్పంచ్ చంద్రరరావు అన్నారు. బంగారమ్మపేట-1 సచివాలయ పరిధిలోని అంతాడలో గురు, శుక్రవారాలు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ఇళ్ల పరిసరాలు, గ్రామ పరిసరాలలో గల తుప్పలను తొలగించారు.